సీపీఎం ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు



అల్విన్‌కాలనీ: హనుమాన్ నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, సభ్యుడు బాలరాజ్, పోలయ్య హాజరై మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాన్ని కార్మికశాఖ అధికారులతో కలిసి నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ.. కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డులు తీసుకోవాలని, దీని ద్వారా రక్త పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గోపమ్మ, పార్వతమ్మ, జ్యోతి, నర్సమ్మ, కృష్ణారావు, గోపి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వనభోజనాలు



కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కేపీహెచ్‌బీకాలనీ: 6వ ఫేజ్‌కు చెందిన సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో గురువారం వనభోజన మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్తీక మాసంలో అత్యంత పవిత్రంగా భావించి ఉసిరి చెట్టుకు పూజ చేసి, ఆ నీడన భోజనం చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని పురాణాలు చెబుతున్నాయని గుర్తు చేశారు. పెద్దలు అందరూ కలిసి ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు



పూజలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. అంజయ్యనగర్‌లో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంతకంటే ముందు వ్యాపారాలను తొలగించారు. అనంతరం కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏసీపీని సన్మానించారు. మార్కెట్‌ను ఆనుకుని రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వారిని తొలగించడంలో మార్కెట్ కమిటీ సభ్యులు సహకారం అందించారని ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టండి



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బాలానగర్: బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్‌కు జిన్నారం మండలం వావిలాల గ్రామంలో భూమి కేటాయించారని, వెంటనే అక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి సునీల్ కుమార్, సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి అలెక్స్, వైస్ ప్రెసిడెంట్ బాలాజీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోరబండ.. సమస్యలు స్టేషన్ నిండా

- నిత్యం ఆకతాయిల తిష్ట
- సమయపాలన లేని రైళ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఎంఎంటీఎస్ స్టేషన్‌లో సౌకర్యాల లేమి



రైల్వే స్టేషన్ బయట మరమ్మతులకు నోచుకోని బస్ బే ప్రాంతం

ప్రజల సౌకర్యార్థం రెండు దశాబ్దాల క్రితం నాటి కేంద్ర ప్రభుత్వం అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలోని రెండు డివిజన్‌లలో బోరబండ, భరత్‌నగర్ రైల్వే స్టేషన్‌లను ఏర్పాటు చేసింది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు కూడా సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు కూర్చునే సీట్లు సైతం అధ్వానంగా తయారయ్యాయి. అధికారుల నిఘా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా స్టేషన్‌లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు వేడుకొంటున్నారు. – మోతీనగర్



ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ప్రవేశద్వారం (ఇన్‌సెట్‌లో అద్దం పగిలిన ప్రవేశద్వారం)

సమస్యలను పరిష్కరించాలి



ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి అయితే చాలు భయంతో వెళ్లాల్సి వస్తోంది. స్టేషన్ నుంచి తమ ఇళ్లకు నడుచుకుంటూ వెళ్లాలి. వీధి లైట్లు సైతం అక్కడక్కడ మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బోరబండ, భరత్‌నగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– చోటా మోయిస్, పండిట్ నెహ్రూనగర్

ఆకతాయిలకు అడ్డాగా..

బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. మద్యం, గంజాయి వంటి వాటిని సేవిస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎవరైనా ఎదురుతిరిగితే దాడులకు సైతం వెనుకాడటం లేదు. అదే విధంగా స్టేషన్ ఆవరణలో ఉన్న ముఖ ద్వారాలు సైతం ధ్వంసమయ్యాయి. గతంలో బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు సైతం ఉండేవి. ప్రయాణికులు వేచి ఉండటానికి బస్ షెల్టర్‌ను స్టేషన్ బయట నిర్మించారు. బస్ షెల్టర్ వస్తువులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. పరిసరాలు చెత్తా చెదారానికి నిలయంగా మారింది. పార్కింగ్ నిర్వహణ కూడా లేకపోవటంతో అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ప్రతి అరగంటకు ఎంఎంటీఎస్ రైలు బోరబండ, భరత్‌నగర్‌ల మీదుగా సికింద్రాబాద్, ఫలక్‌నామా, నాంపల్లికి నడిచేవి. నేడు సమయపాలన లేక చాలా మంది నిరుద్యోగులు, ఉపాధి కోసం వెళ్లే కూలీలు బస్సుల్లో వెళ్తున్నారు. దీంతో అధిక ఛార్జీలు ఖర్చు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చాలు జేబు దొంగల ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అదే విధంగా మూసాపేట డివిజన్ భరత్‌నగర్ రైల్వే స్టేషన్ ఒక వైపు బహిరంగ స్థలాలు ఉండటంతో చెట్ల పొదల్లో ఆకతాయిలు తిష్టవేసి మహిళలు, ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి యధావిధిగా రైల్వేస్టేషన్‌కు బస్సులు నడపాలని, స్టేషన్‌కు ఒకవైపు ఉన్న టికెట్ కౌంటర్‌ను రెండు వైపులా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.





చెత్తా చెదారం, కలుపు మొక్కలతో రైల్వే స్టేషన్ రోడ్డు

నాలా విస్తరణ పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: నాలా విస్తరణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్‌లో ఇళ్ల మధ్యన కొనసాగుతున్న నాలా విస్తరణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నాలాకు ఇరువైపులా ఉన్న నివాసితులు పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగుల సత్యం, కో ఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి, వి. రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బి. వెంకటయాదవ్, నాయకులు శివరాం రెడ్డి, బి. నరసింహ, మాస్టర్ యోగి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్య భిక్ష



అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధి పాపిరెడ్డినగర్‌లోని శ్రీ వీరాంజనేయ శివాలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వాములకు భిక్ష ప్రారంభించారు. ప్రతి రోజూ జరిగే ఈ భిక్ష కార్యక్రమం డిసెంబర్ 31 వరకు కొనసాగుతుందని గడ్డం రాజేశ్వర్‌రెడ్డి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి స్వామి, కుమారస్వామి, అప్పల నాయుడు స్వామి, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, రమేష్ యాదవ్, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, సాయి స్వామి, కరుణాకర్ స్వామి, రవీందర్ రెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రాకేష్ గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సర్వే ఆఫ్ ఇండియా ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 నుంచి 4 గంటల వరకు రామరాజు గెస్ట్ హౌస్, రోడ్డు నెంబర్ 33 నుంచి 42 వరకు, సర్వే ఆఫ్ ఇండియా కమ్యూనిటీ హాల్, అయ్యప్ప సొసైటీ రోడ్డు 45 నుంచి 55 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

మూసాపేట: పుల్లారెడ్డి 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పుల్లారెడ్డి కాంపౌండ్, మెజెస్టిక్ విల్లాస్, శివసాయి కాలనీ, ఆంజనేయ నగర్ కాలనీ, సైబర్ సిటీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, అధికారులు

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ సబ్‌స్టేషన్ నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ మీదుగా బాలకృష్ణ నగర్ వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ట్రాఫిక్, వాటర్‌వర్క్స్, సీవరేజ్ లైన్లు, మాన్‌హోల్ మరమ్మతులు, విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ సమస్యలు ఉన్నాయని, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వీలైనంత త్వరగా నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్డు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్, అధికారులు అమీరుద్దీన్, నాయక్, సూర్యం, బాలకృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, విక్రం, ప్రవీణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని
నోటీసులివ్వడం సరికాదు



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మూసాపేట: ఒక భవన సముదాయంలో 10 విద్యుత్ మీటర్లు దాటితే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో అధికారులు నోటీసులివ్వడం సరికాదని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. టీఎస్‌పీడీసీఎల్ అధికారులు దాదాపు 20 భవనాలకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని నోటీసులివ్వడంతో కాలనీ వాసులు గురువారం కార్పొరేటర్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన కరెంట్‌ను ఇస్తూ ఏ రోజూ ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా చర్యలు తీసుకోలేదన్నారు. అటువంటిది కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే కరెంట్ సరిగ్గా ఇవ్వకపోగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా ఉన్న బిల్డింగ్ యజమానులకు నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ బిక్స్ సంచాలకులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. రోజు రోజుకు యూనివర్సిటీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారిందన్నారు. స్పందన బ్లాక్ చుట్టు పక్కల, క్యాంటిన్ పరిసరాల్లో, క్యాంపస్ 2వ గేట్ వద్ద, కిన్నెర, మంజీరా వసతి గృహం వెనుక భాగంలో డ్రైనేజీ నీరు పొంగి బయటకు వస్తుండటంతో దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అవసరమైన నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి సిద్ధార్థ్, శివకృష్ణ, బ్రహ్మం గౌడ్, అర్జున్ గౌడ్, చంద్రశేఖర్, సాయికుమార్ రాథోడ్, సాత్విక్, శ్రీను, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



కార్మికులు, పేదలతో సునీల్ కుమార్

బాలానగర్: సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకొని సాయి నగర్‌లోని సాయి నాగేంద్ర ఆలయంలో జీహెచ్ఎంసీ కార్మికులు, పేదలకు దుప్పట్లను గురువారం మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు అంబటి సునీల్ కుమార్ పంపిణీ చేశారు. అదేవిధంగా సత్యసాయి బాబా భక్తులు ఆయుర్వేద వైద్యుడు సత్యనారాయణ స్వామి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఇండియన్ ఫొటో ఫెస్టివల్– 2024 ప్రారంభం



మాదాపూర్: ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఫొటో ఫెస్టివల్ 2024ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, తెలంగాణ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది ఒక ఆర్ట్ అని పెయింటింగ్ కంటే క్లిష్టమైనదన్నారు. ఫొటో ఫెస్టివల్ 10వ ఎడిషన్‌ను జనవరి 5వ తేదీ 2025 వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో 45 దేశాల నుంచి 550 మంది ఫొటోగ్రాఫర్‌ల 1500కి పైగా చిత్రాలను అందుబాటులో ఉంచారు. ఇండియా, యూఎస్ఎ, యూకే, దక్షిణాఫ్రికా, ఉజ్బెకిస్తాన్, వెనిజులా, టర్కీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, స్వీడన్, స్పెయిన్, సింగపూర్, సైబీరియా, రష్యా, కెనడా తదితర దేశాల ఫొటోగ్రాఫర్‌ల చిత్రాలు అందుబాటులో ఉన్నాయి.

నగరంలో అదృశ్యమై.. సూర్యలంకలో ప్రత్యక్షమై..

మూసాపేట: పాఠశాలకు వెళ్లి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినుల ఆచూకీ గురువారం లభ్యమైంది. పోలీసులు వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన ఓ విద్యార్థిని (13) అదే ప్రాంతానికి చెందిన మరో విద్యార్థిని (13) వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ప్రతి రోజు వాళ్ల అమ్మ పాఠశాలకు తీసుకొచ్చి, సాయంత్రం తీసుకువెళ్లేది. బుధవారం ఉదయం పాఠశాలలో దింపి సాయంత్రం తీసుకువెళ్లేందుకు రావడంతో ఎంత సేపైనా బయటకు రాకపోవడంతో స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో బుధవారం రాత్రి కూకట్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కిడ్నాప్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పాఠశాలలోని తోటి విద్యార్థినులను ప్రశ్నించగా.. ఒక విద్యార్థిని ఊరు చీరాల దగ్గరలోని ఓ గ్రామం అని, సూర్యలంక బీచ్ గురించి కొన్ని రోజులుగా చెబుతూ ఉండేదని పోలీసుల విచారణలో తేలింది. గురువారం మధ్యాహ్నం అక్కడకు చేరుకుని విద్యార్థినులను గుర్తించామని, నగరానికి తీసుకొస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రతిపాదనల్లోనే 'విప్రో సర్కిల్'



విప్రో సర్కిల్ ఇదే..

- ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నేటికీ ప్రశ్నార్థకం
- తాజాగా మెట్రో ప్రకటనతో మరుగున పడిన ఫ్లైఓవర్

రాయదుర్గం: నానక్‌రాంగూడలో ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో విప్రో సర్కిల్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ కూడలి ద్వారానే ఇటు నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి ప్రాంతాలకే కాకుండా ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లోని జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు వెళ్లేందుకు ప్రధాన కూడలిగా మారింది. దీంతో విప్రో సర్కిల్‌ను మరింత సౌకర్యవంతంగా చేయాలనే ప్రతిపాదనలు అలాగే ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడానికి ఎన్నో ప్రతిపాదనలు చేసినా ఏవీ ఇప్పటివరకు అమలుకాలేదు. తాజాగా గతేడాది చివరలో ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన చేయగా ప్రభుత్వం ఆమోదం తెలిపినా ఆ తర్వాత ప్రభుత్వం మారడం, మెట్రో రైలును విప్రో సర్కిల్ మీదుగా ప్రతిపాదించడం తెలిసిందే.

మొదట్లో 'ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి'

విప్రో సర్కిల్‌లో ఏపీఐఐసీగా కొనసాగిన సమయంలో కొనసాగినప్పుడు విప్రో సర్కిల్‌లో 'ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తలపెట్టారు. ఆ తర్వాత రాష్ట్ర ఏర్పాటు, కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఇది ప్రతిపాదనకే పరిమితమైంది. తాజాగా గత ఏడాది చివరలో శాసనసభలో ఎమ్మెల్యే గాంధీ విప్రో సర్కిల్‌లో ప్లస్ ఆకారంలో ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రతిపాదించారు. అమెజాన్, అమెరికన్ కాన్సులేట్ వంటివి కూడా ఈ ప్రాంతంలోనే ఉండడం, భారీ సంస్థలు కొనసాగుతుండడంతో ఉద్యోగులు పెరుగుతుండడంతో విప్రో కూడలిలో ఫ్లైఓవర్ ఆవశ్యకత ఉంది. కానీ ప్రస్తుతం ఆ ఊసే లేదు.

అర్బన్‌స్ట్రీట్ ఫర్నిచర్.. నిర్మించి వదిలేశారు..

ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఓఆర్‌ఆర్ వరకు ఉండే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఆకట్టుకునేలా ఆహ్లాదపూరిత వాతావరణంలో గ్రీనరీతోపాటు పూలమొక్కల మధ్య నుంచి వాకింగ్, సైక్లింగ్ చేస్తూ అందరూ సేద తీరేలా దాదాపు ఒకవైపు విప్రో సర్కిల్ వరకు పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. సమీపంలోని నివాసితులు ఇక్కడ వాకింగ్ చేస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో చేపట్టలేకపోయారు.

బీఆర్‌టీఎస్ ప్రతిపాదన ఊసే లేదు..

ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీలను కలుపుతూ బీఆర్‌టీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని 10ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. ముఖ్యంగా కేపీహెచ్‌బీ నుంచి మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గంలోని ఐటీకంపెనీలు, హైదరాబాద్ నాలెడ్జి సిటీ మీదుగా ట్రిపుల్‌ఐటీ కూడలి మీదుగా విప్రో సర్కిల్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను కలిపేలా బీఆర్‌టీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. కానీ ఆతర్వాత ఆదిశగా చర్యలు నిల్.

రాయదుర్గం– నియోపోలీస్ వరకు మెట్రో..

మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ వద్ద రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి హైదరాబాద్ నాలెడ్జి సిటీ మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్ మీదుగా నియోపోలీస్ వరకు మెట్రో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన ప్రణాళిక, నిధుల కేటాయింపు, స్టేషన్ల గుర్తింపు అన్నీ పూర్తయ్యాయి. ఇక పనులు ప్రారంభించాల్సి ఉంది.

వైట్ టాపింగ్ రోడ్డు ఒకవైపే..

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రధానరోడ్డుగా గుర్తించే ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఓఆర్‌ఆర్ వరకున్న రోడ్డును వైట్ టాపింగ్ ఆరులేన్ల రోడ్డుగా మార్చాలని పనులను ప్రారంభించారు. ఐతే ఈ పనులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో విప్రో సర్కిల్ వరకు పనులను చేపట్టి ఆపేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అలాగే మిగిలిపోయింది. పెరుగుతున్న ట్రాఫిక్, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొని విప్రో సర్కిల్ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.